ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి
జిల్లా వార్తలు

సోమవారం 26 మే 2025



జిరాయితీ భూమితో కలిపి చదును చేసిన ప్రభుత్వ భూమి

ప్రభుత్వ టీచర్లకు గడ్డు పరిస్థితి



గతంలో ఏజెన్సీ నుంచి పలువురు ఉపాధ్యాయులు బదిలీపై మైదాన ప్రాంతానికి రాక

- జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో విధులు నిర్వహణ
- తాజాగా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టిన ప్రభుత్వం
- ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయితే బదిలీ తప్పనిసరి నిబంధన
- ప్రభుత్వ టీచర్లు సొంత యాజమాన్య స్కూళ్లకు వెళ్లిపోవాలని ఆదేశాలు
- దిక్కుతోచని స్థితిలో పలువురు ఉపాధ్యాయులు

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేస్తున్న ఆదేశాలతో ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పరిస్థితి అయోమయంగా మారింది. ఒకేచోట ఎనిమిది సంవత్సరాల సర్వీసు దాటిన ఉపాధ్యాయులు తమ సొంత మేనేజ్‌మెంట్ స్కూళ్లకే వెళ్లాలంటూ ఇచ్చిన ఆదేశాలతో మైదాన ప్రాంతంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల పరిస్థితి గందరగోళంగా తయారైంది.

తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు ఏ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులైనా తమకు నచ్చిన యాజమాన్య పాఠశాలలకు బదిలీ అయ్యే వెసులుబాటు కల్పించింది. దీంతో ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు మైదాన ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. వీరు జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. అప్పటి నుంచి ఆయా పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమంది ఉపాధ్యాయులు ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నారు. బదిలీల నిబంధనల ప్రకారం వీరికి కచ్చితంగా స్థాన చలనం వుంటుంది. ప్రస్తుతం విద్యా శాఖ అధికారులు ప్రస్తుతం చేపట్టిన బదిలీల్లో భాగంగా వీరు తప్పనిసరిగా బదిలీ కోసం దరఖాస్తు చేయాలి. తమకు అనుకూలమైన ప్రాంతాల్లోని పాఠశాలలను ఆప్షన్స్‌గా ఇవ్వొచ్చు. కానీ విద్యా శాఖ అధికారులు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలలకు నియమితులై, అనంతరం కాలంలో జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయి, ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులంతా తమ సొంత యాజమాన్యమైన ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ మైదాన ప్రాంతంలోని జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయిన వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలలు చాలా తక్కువ వున్నాయి. దీంతో ... మిగతా 6వ పేజీలో

సర్వర్‌తో సమస్యలు

ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తుల స్వీకరణలో గందరగోళం

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల మధ్య వ్యత్యాసం
- సర్వీస్ పాయింట్ల కేటాయింపులో తికమక
- స్కూల్ అసిస్టెంట్ల బదిలీల దరఖాస్తుకు గడువు పెంచాలి: టీచర్లు



విశాఖ సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో బదిలీల దరఖాస్తులను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు, సిబ్బంది

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గందరగోళంగా మారింది. దరఖాస్తు చేసేటప్పుడు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, కొన్నిసార్లు ఆన్‌లైన్ సర్వర్ మొరాయిస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సమస్యతో ఆన్‌లైన్‌లో దరఖాస్తును డీఈవో తిరస్కరిస్తే అది సంబంధిత మండల విద్యాశాఖాధికారికి వెళ్లాల్సి ఉండగా.. నేరుగా ఉపాధ్యాయుడికి వస్తోందని, కొన్ని సందర్భాల్లో హోల్డ్‌లో ఉండిపోతుందని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సర్వీస్ పాయింట్ల కేటాయింపులో ఇబ్బందులు వస్తున్నాయని, స్వాజ్ సదుపాయం వినియోగించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో బదిలీకి దరఖాస్తు చేయడానికి ఆదివారంతో గడువు ముగిసింది. అయితే చాలామంది స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తులు అప్‌లోడ్ కానందున గడువు పెంచాలని వారు కోరుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలకు కలిపి 4,811 మందికి స్థానచలనం కలుగుతుందని విద్యాశాఖ ఐదారు రోజుల క్రితమే ప్రకటించింది. దీని ప్రకారం 88 హెచ్ఎం పోస్టులకు 123 మంది ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేశారు. వీరి దరఖాస్తులను పరిశీలించి అప్‌లోడ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో సుమారు 2,200 ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే బదిలీలకు దరఖాస్తు చేసే టీచర్లకు సర్వీస్ పాయింట్ల కేటాయింపులో గందరగోళం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు/స్కూల్ అసిస్టెంట్ల నియామకంపై ఇంకా తగిన ఆదేశాలు రానందున బదిలీ దరఖాస్తుపై కొంత గందరగోళం నెలకొంది. మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా నియమించేటప్పుడు ... మిగతా 6వ పేజీలో

గందరగోళంగా టీచర్ల బదిలీల ప్రక్రియ

- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

నర్సీపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ గందరగోళంగా తయారైందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, రేషనలైజేషన్‌తో ముడి పెట్టడం వల్ల టీచర్ల బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని అన్నారు. ఒకసారి రేషనలైజేషన్ అయిన తర్వాత కనీసం ఐదు సంవత్సరాల వరకు ఉపాధ్యాయులను కదపకూడదని అన్నారు. ఇలా అయితేనే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుందని అన్నారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెండేళ్లకు రెండు పాయింట్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021లో బదిలీపై వచ్చి 2025లో రేషనలైజేషన్ అయిన ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలన్నారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో తలెత్తిన సమస్యలన తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, నేతలు కురచా వెంకటరమణ, జీపీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

బాటజంగాలపాలెంలో రెండు ఎకరాలు ఆక్రమణ

- అందులో ఉన్న యూకలిప్టస్ తోట అమ్మకం
- జిరాయితో కలిపి దున్నేసిన కబ్జాదారుడు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- ఆక్రమించిన ప్రభుత్వ భూమి విలువ రూ.5 కోట్లు

సబ్బవరం, మే 25 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని బాటజంగాలపాలెంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. మూడేళ్ల క్రితం సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకోగా.. పత్రికల్లో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. భూమిని స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మళ్లీ ఇటీవల ఈ భూమిని ఆక్రమించి, అందులో వున్న యూకలిప్టస్ తోటను అమేశాడు. అంతేకాక భూమిని చదును చేశాడు. ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

మండలంలోని బాటజంగాలపాలెంలో రెవెన్యూ పరిధి సర్వే నంబరు 195లో 5.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి మధ్యలో నుంచి కోడురు జంక్షన్-నారపాడు రోడ్డు వుంది. అంటే రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ భూమి ఉంది. పక్కనే వున్న జిరాయితీ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి నాలుగేళ్ల క్రితం సుమారు రెండు ఎకరాల మేర ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడు. ప్రభుత్వ భూమిలో అప్పటికే యూకలిప్టస్ తోట వుంది. భూమి చుట్టూ కాంక్రీట్ పోల్స్‌తో ఫెన్సింగ్ వేస్తుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో 'ఆంధ్రజ్యోతి'లో 2022 ఆగస్టు 24న 'దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా' శీర్షికతో కథనం వచ్చింది. దీంతో స్పందించిన అప్పటి తహసీల్దార్ కె.రమాదేవి ఆదేశాల మేరకు ఆర్ఐ రమణ ఫెన్సింగ్ తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల ఆక్రమణదారుడు ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తీసేశాడు. యూకలిప్టస్ తోటను అమ్మేసుకున్నాడు. జిరాయితీతోపాటు సర్వే నంబరు 195లో సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని చదును చేసి. ప్రభుత్వ భూమి ఆనవాళ్లు లేకుండా చేశాడు. కానీ ఇంతవరకు రెవెన్యూ అధికారులెవరూ అటువైపు కన్నెత్తి అయినా చూడలేదు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి జాతీయ రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడ ఎకరా రూ.2.5 కోట్లు విలువ చేస్తుంది. కబ్జాకు గురైన ప్రభుత్వం భూమి రూ.5 కోట్లు వుంటుందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆక్రమించిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.





బాలాలయంలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నూకాంబిక ఆలయానికి కొనసాగిన భక్తుల రద్దీ

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దర్శనం కోసం ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది. నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ముగిసి నాలుగు వారాలు అయినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. ప్రస్తుతం విద్యా సంస్థలకు సెలవులు కావడంతో ఇతర రోజుల్లో కూడా కుటుంబాలతో సహా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. బాలాలయంతో పాటు క్యూలైన్లు అన్ని భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

-అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి

రైలు ఎక్కుతూ జారిపడి

మహిళ మృతి

- మృతురాలి స్వగ్రామం దొండపూడి
- హైదరాబాద్ శివారు చర్లపల్లి స్టేషన్‌లో ఘటన
- భర్త ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివాసం
- వేసవి సెలవులకు వస్తుండగా ఘటన

రావికమతం, మే 25 (ఆంధ్రజ్యోతి):



మట్టా శ్వేత (ఫైల్ ఫొటో)

హైదరాబాద్ శివారులోని చర్లపల్లి శాటిలైట్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో మండలంలోని దొండపూడి గ్రామానికి చెందిన మహిళ మృతిచెందింది. తాను ప్రయాణిస్తున్న రైలులో ఒక బోగీ నుంచి మరొక బోగీలో మారే క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని దొండపూడికి చెందిన గట్టా వెంకటేశ్ హైదరాబాద్ మియాపూర్ ప్రాంతంలోని ... మిగతా 6వ పేజీలో

రంగబోలుగెడ్డలో అక్రమ తవ్వకాలు

- కట్టడానికి పొంచి ఉన్నముప్పు
- ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా తవ్వకాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతుల ఆరోపణ

చెక్ డ్యామ్‌ను ఆనుకొని భారీ గోతులు



రంగబోలు గెడ్డలో చెక్‌డ్యామ్‌ను ఆనుకొని ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు.



తవ్విన మట్టిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

కశింకోట, మే 25 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధి రంగ బోలుగెడ్డలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. పంట భూములను మెరకుచేసుకునే పేరుతో మట్టిని తరలించుకుపోయి ఇళ్ల పునాదులు, ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి వినియోగిస్తున్నారు. రంగబోలుగెడ్డలో ఒక ఎక్స్‌కవేటర్ తో మట్టి తవ్వి, ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు.

మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లు, ఉపాధి హామీ పథకం కింద కూలీలు మట్టి తవ్వకం చేయని సాగునీటి చెరువుల్లో పేరుకుపోయిన మట్టిని, రైతులు తమ పొలాల్లో వినియోగించుకోవడానికి ... మిగతా 6వ పేజీలో

తవ్వుతున్న కొద్దీ..

అచ్యుతాపురాన్ని వీడని సైబర్ నేరాల ముఠా?

- పోలీసుల దాడి నుంచి పరారైన వ్యక్తులు ఈ ప్రాంతంలోనే ఉన్నట్టు స్థానికుల అనుమానం
- సైబర్ నేరాల ముఠాకు సంబంధించి వెలుగులోకి కొత్త విషయాలు
- వ్యాపారం పేరుతో అద్దెకు అతిథిగృహం, అపార్ట్‌మెంట్లు
- సహకరించిన స్థానిక నాయకులు
- కేసును సీఐడీకి అప్పగించడంతో నేతల్లో గుబులు

అచ్యుతాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం సైబర్ మోసాలకు పాల్పడుతూ, పోలీసుల దాడి నుంచి తప్పించుకుని పారిపోయిన వ్యక్తులు, వారి కుటుంబీకులు ఈ ప్రాంతంలో ఉన్నట్టు స్థానికులు అనుమానిస్తున్నారు. మరోవైపు ఈ కేసును సీఐడీకి అప్పగిస్తున్నట్టు వార్తలు రావడంతో ఇక్కడ సైబర్ నేరగాళ్లకు సహకరించిన వారు గుబులు చెందుతున్నారు. ముఖ్యంగా గెస్ట్‌హౌస్, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు అద్దెకు ఇప్పించిన వారు, సైబర్ నేరగాళ్ల ద్విచక్ర వాహనాల కొనుగోలు చేసినప్పుడు ష్యూరిటీ సంతకాలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. ఈ కేసుకు సంబంధించి పలు విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

అచ్యుతాపురంలో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి సైబర్ మోసాలకు పాల్పడుతున్న డెన్‌లపై పోలీసులు గత మంగళవారం రాత్రి దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పోలీసులు 33 మందిని మాత్రమే అదుపులోకి తీసుకోగా, ఇంతకన్నా ఎక్కువ మంది పారిపోయినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జంగులూరు జంక్షన్ సిరిపురం లేఅవుట్‌లోగల భువనేశ్వరి అపార్టుమెంట్‌లోని ఏడు ఫ్లాట్లలో ఉంటున్న వారు కూడా పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. అయితే ఇక్కడ పెంపుడు కుక్క ఉండిపోయింది. దీనిని ఎవరూ గమనించలేదు. శనివారం ఉదయం వాకింగ్‌కి వెళ్లిన కొంతమందికి.. కుక్క మూలుగు వినిపించడంతో వాచ్‌మన్‌ను పిలిచి గది తలుపులు తెరిపించారు. కొన ఊపిరితోఉన్న కుక్కను బయటకు తీసి సపర్యలు చేశారు. శనివారం సాయంత్రం ఒక అపరిచిత మహిళ వచ్చి కుక్కను తీసుకువెళ్లిపోయింది. దీనినిబట్టి పోలీసుల నుంచి తప్పించుకున్న సైబర్ నేరగాళ్లు, వారి కుటుంబీకులు ఈ ప్రాంతంలోనే వున్నారని



సైబర్ నేరస్థులు అద్దెకు తీసుకున్న అవెన్యూ

స్థానిక నేతల్లో గుబులు

విజయవాడకు చెందిన (..అని చెప్పుకున్నాడు) ఒక వ్యక్తి ... మిగతా 6వ పేజీలో

సివిల్స్ ప్రిలిమినరీకి 53.38 శాతం హాజరు

- మొత్తం అభ్యర్థులు 8,422 మంది
- పరీక్షకు హాజరైంది 4,496 మంది
- విశాఖలో 19 కేంద్రాల్లో నిర్వహణ
- పలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



వాల్తేర్ కేంద్రీయ విద్యాలయంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి):

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విశాఖ జిల్లాలోని 19 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 8,422 మంది అభ్యర్థులకుగాను 4,496 (53.38 శాతం) మంది హాజరయ్యారు. జనరల్ స్టడీస్ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంతం 4.30 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ, అక్కయ్యపాలెంలోని కేంద్రీయ విద్యాలయం కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, అభ్యర్థులకు ఏర్పాటు చేసిన సదుపాయాలపై ఆరా తీశారు.

ఇదిలావుండగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో వారి కోసం తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో అభ్యర్థులు ఇక్కట్లకు గురయ్యారు. వీల్‌చైర్లు సైతం ఏర్పాటు చేయకపోవడంతో పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు దివ్యాంగ అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. సాయపడేందుకు సిబ్బందిని నియమించకపోవడంతో వారు అసహనాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ టీచర్లకు గడ్డు పరిస్థితి

... 5వ పేజీ తరువాయి

ఈ రెండు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఆయా ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో సంవత్సరాల తరబడి పనిచేసి, మైదాన ప్రాంతానికి వచ్చిన ఉపాధ్యాయులు మళ్లీ ఏజెన్సీకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఉపాధ్యాయ సంఘాలు కూడా స్పందించాలని కోరుతున్నారు.

సర్వర్‌తో సమస్యలు

... 5వ పేజీ తరువాయి

స్కూల్ అసిస్టెంట్లలో సబ్జెక్టు వారీగా నిష్పత్తి ఎంత అనేది ఇంతవరకు చెప్పలేదు. సర్దుబాటు ద్వారా మిగులుగా చూపించిన స్కూల్ అసిస్టెంట్లను మాత్రమే మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తారా? అన్నదానిపై స్పష్టత లేదు. ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి కావాలన్న నిబంధన మేరకు 2017 ఆగస్టు 31 తేదీని ప్రామాణికంగా తీసుకున్నారు. దీంతో ఆ మరుసటి రోజు అంటే 2017 సెప్టెంబరు ఒకటిన పాఠశాలల్లో చేరిన టీచర్లకు ఎనిమిదేళ్ల సర్వీస్ పాయింట్లు వర్తించవని విద్యాశాఖ మార్గదర్శకాలు ఇవ్వడంతో అప్పట్లో పలు కారణాలతో ఒకరోజు ఆలస్యంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు పూర్తిగా సర్వీస్ పాయింట్లు రావడం లేదని గుర్తు చేస్తున్నారు.

అదేవిధంగా 2017లో జరిగిన బదిలీల్లో ఒక పాఠశాలకు వచ్చిన టీచర్లు కొందరు 2023లో అమలులోకి వచ్చిన జీవో నంబర్-117 మేరకు మరోచోటకు బదిలీ కావాల్సి వచ్చింది. 2023 నుంచి ఇప్పటివరకు అదే స్కూల్‌లో పనిచేస్తున్న వారంతా జీవో నంబర్-117 రద్దుతో సర్దుబాటుకు గురయ్యారు. దీంతో సర్వీస్ పాయింట్ల కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతుందని వారు వాపోతున్నారు. బదిలీకి తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి దాని ప్రతిని సంబంధిత ఎంఈవోకు అందజేయాలి. అయితే ఆఫ్‌లైన్‌లో ఉన్న దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దరఖాస్తుతో పోల్చిన తరువాతే అప్‌లోడ్ చేయాలి. అయితే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తుల మధ్య కొన్ని పాయింట్లు తేడా వస్తోందని, దీనిపై సంబంధిత టీచర్‌ను పిలిచి మళ్లీ సవరిస్తున్నారు. స్పౌజ్ పాయింట్లు కొందరికి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదంటున్నారు.

ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్

బదిలీల దరఖాస్తుల స్వీకరణ నేపథ్యంలో నగరంలోని సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు మండలాల విద్యాశాఖాధికారులు, ఇతర సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. టీచర్లు పెట్టుకునే ఆన్‌లైన్ దరఖాస్తులతో ఎంఈవోల ద్వారా తెచ్చుకున్న ఆఫ్‌లైన్ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో దరఖాస్తుల పరిశీలన కొనసాగింది. దరఖాస్తు చేసేటప్పుడు తలెత్తే ఇబ్బందుల గురించి పలువురు ఉపాధ్యాయులు ఇక్కడకు వచ్చి డీఈవోకు వివరించారు.

రంగబోలుగెడ్డలో అక్రమ తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

ఇరిగేషన్ అధికారుల అనుమతితో తవ్వి తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చింది. దీనిని అడ్డంపెట్టుకుని కొంతమంది వ్యక్తులు మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కశింకోట మండలం ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధిలో కొత్తపల్లి బుచ్చెయ్యపేట వద్ద రంగబోలు గెడ్డలో ఎక్స్‌కవేటర్ సహాయంతో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఐదు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని గెడ్డ నుంచి మట్టిని తరలించుకుపోతున్నారు. చెక్ డ్యామ్‌కు అతి చేరువలో భారీ గొయ్యి పడేలా మట్టిని తవ్వేశారు. దీనివల్ల చెక్ డ్యామ్‌కు ముప్పు ఏర్పడింది. గెడ్డలో చెక్ డ్యామ్ వద్ద మట్టి తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా రంగబోలు గెడ్డలో మట్టి తవ్వకాలపై జలవనరుల శాఖ ఏఈ అమూల్యకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరణ కోరగా.. గెడ్డలో మట్టి తవ్వకాల కోసం ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని, అనుమతులు సైతం ఇవ్వలేదని స్పష్టం చేశారు.

తవ్వుతున్న కొద్దీ..

... 5వ పేజీ తరువాయి

ఏడాది క్రితం అచ్యుతాపురం వచ్చి కొంతమంది స్థానిక నాయకులతో పరిచయం ఏర్పరచుకున్నాడు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఏదైనా వ్యాపారం పెట్టాలన్న ఉద్దేశంతో వచ్చామని, అన్నీ పరిశీలించిన తర్వాత వ్యాపారాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆఫీస్‌తోపాటు తాము వుండడానికి అద్దెకు భారీ భవనం కావాలని అడిగారు. స్థానిక నేతల సహకారంతో వెదురువాడలో ఆధునిక వసతులు వున్న ఒక ప్రైవేటు గెస్ట్‌హౌస్‌ని అద్దెకు తీసుకున్నారు. తరువాత తాము ప్రారంభించబోయే కర్మాగారంలో పనిచేయడానికి ఉద్యోగులు వస్తున్నారని, వారు వుండడానికి అపార్ట్‌మెంట్ కావాలని చెప్పడంతో అచ్యుతాపురం-పూడిమడక రహదారిలో కుమారపురం వద్ద ఒక అపార్టుమెంట్‌ను చూపించారు. దీనిని కూడా అద్దెకు తీసుకున్నారు. అచ్యుతాపురంలో మరికొంత మంది నాయకులు, ఇతరులతో పరిచయాలు పెంచుకొని ఒకరికి తెలియకుండా మరొకరి సహకారంతో భోగాపురంలో పవన్ అపార్టుమెంట్, ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే మార్గంలో ఐదంతస్తుల ఉషోదయ అవెన్యూ, జంగులూరు జంక్షన్ వద్ద సిరిపురం లేఅవుట్‌లో భువనేశ్వరి అపార్ట్‌మెంట్‌లో ఏడు ఫ్లాట్లు అద్దెకు తీసుకున్నారు. వీటిల్లో కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసి సైబర్ మోసాలకు దిగారు.

అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో రామన్నపాలెం వద్ద ఎస్‌బీఐ ఎల్ లేఅవుట్ సమీపంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నివాసం ఉంది. దీనికి సుమారు అర కిలోమీటరు దూరంలో ఉషోదయ అవెన్యూను సైబర్ నేరగాళ్లు అద్దెకు తీసుకున్నారు. దీని సెల్లార్‌ను పూర్తిగా మూసేశారు. ఎమ్మెల్యే ఇంటికి ఎవరు వెళ్లాలన్నా ఈ అవెన్యూ ముందు నుంచే వెళ్లాలి. సుమారు ఏడాది నుంచి ఇక్కడ సైబర్ మోసాలు జరుగుతున్నప్పటికీ ఎవరూ గుర్తించకపోవటం విశేషం.

పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలు కొనుగోలు

సైబర్ నేరగాళ్లు అచ్యుతాపురంలోని ఆటోమొబైల్ షోరూమ్‌లో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసినట్టు తెలిసింది. అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో గల ఒక ద్విచక్రవాహన షోరూంలో ఒకేసారి 15 వాహనాలు కొనుగోలు చేశారని సమాచారం. ఇదే రోడ్డులో పాతవాహనాల విక్రయ కేంద్రం లో కూడా పది ద్విచక్రవాహనాలు కొనుగోలు చేశారని చెబుతున్నారు. వాహనాలు కొనుగోలు చేసే సమయంలో ఒక ఆర్మీ అధికారితోపాటు కొంతమంది స్థానికులు ష్యూరిటీలు ఇచ్చారని తెలిసింది.

రైలు ఎక్కుతూ జారిపడి మహిళ మృతి

... 5వ పేజీ తరువాయి

ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య శ్వేత (33), పిల్లలు రిత్విక్, చేతన్‌లతో కలిసి గండి మైసమ్మ ప్రాంతంలో నివాసం వుంటున్నాడు. స్కూళ్లకు వేసవి సెలవులు కావడంతో ఆదివారం దొండపూడి రావాలనుకున్నారు. పిల్లలిద్దరినీ తీసుకుని శ్వేత ఆదివారం ఉదయం లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ వీరు స్టేషన్‌కు వెళ్లేసరికి రైలు బయలుదేరుతున్నది. దీంతో హడావిడిగా జనరల్ బోగీ ఎక్కేశారు. సుమారు గంట తరువాత రైలు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుని ఆగింది. దీంతో శ్వేత, ఇద్దరు పిల్లలతో సాధారణ బోగీ నుంచి దిగి రిజర్వేషన్ చేయించుకున్న బోగీ దగ్గరలోకి చేరుకుంది. అయితే రైలు కదలడంతో.. పిల్లలను బోగీలోకి ఎక్కించి, తాను కూడా ఎక్కబోయింది. ఈ క్రమంలో పట్టుతప్పి బోగీకి, ప్లాట్‌ఫారానికి మధ్యలో ఇరుక్కుపోయి కిందకు జారిపోయింది. తీవ్రంగా గాయడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయం దొండపూడిలోని కుటుంబ సభ్యులకు తెలియడంతో వెంకటేశ్ తండ్రి అప్పారావు, తల్లి ముసలమ్మ కుప్పకూలిపోయారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి బంధువులు ఇక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- రోడ్లు వేస్తున్నా డ్రైనేజీలు నిర్మించడం లేదు
- వర్షం వస్తే రహదారులపై నిలిచిపోతున్న నీరు
- మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకం



ఎలమంచిలి పెదపల్లి రోడ్డులో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ



పెదపల్లి రోడ్డులో డ్రైనేజీలు లేకపోవడంతో నిలిచిపోయిన నీరు

ఎలమంచిలి, మే 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పలుచోట్ల అసంపూర్తిగా పనులు చేపడుతుండడంతో పట్టణవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. నీరు పోయేందుకు డ్రైనేజీలు అసంపూర్తిగా ఉన్నచోట లక్షలాది రూపాయలతో రహదారులు నిర్మాణం చేపడుతున్నారు. చినుకు పడితే రోడ్లపైనే వర్షం నీరు నిలిచిపోతున్నది. దీంతో రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చేపట్టాల్సిన పనులలో కూడా నిర్లక్ష్యం వహిస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్ల నిర్మాణంతోపాటు డ్రైనేజీలను నిర్మించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ఆవిధంగా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని పలుచోట్ల రహదారులు నిర్మించిన చోట డ్రైనేజీలు లేకపోవడంతో రోజుల తరబడి వర్షం నీరు నిలిచిపోతున్నది. దీంతో ప్రజలకు నిత్యం నరకయాతన తప్పడం లేదు. రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి పెదపల్లి వెళ్లే రోడ్డుపై గత ఏడాది రోడ్డును నిర్మించిన అధికారులు అసంపూర్తిగా డ్రైనేజీలు వదిలేయడంతో సమస్య తలెత్తుతున్నది.

మరికొన్ని చోట్ల డ్రైనేజీలు మూసుకుపోయినా.. అసంపూర్తిగా దర్శనమిస్తున్నా.. అధికారులు వాటివైపు కన్నెత్తి చూడడం లేదు. పట్టణంలోని పరమేశ్వరి థియేటర్ సమీపంలో ఈ దుస్థితి నెలకొన్నా పట్టించుకున్నవారే లేకుండా పోయారు. లక్షలాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో పనిచేసి ఇబ్బందులు లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా రోడ్ల పక్క స్థలాలు, కాలువలు

- రోడ్లపై చెత్తను పారబోస్తున్న గ్రామస్థులు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు



పెదకవలాపల్లికి వెళ్లే దారిలో వేసిన కోళ్ల వ్యర్థాలు



గోవిందపాలెం నుంచి ఎన్ఏటీబీకి వెళ్లే రోడ్డులో వేసిన చెత్త కుప్పలు

రాంబిల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్ల పక్కన ప్రభుత్వ స్థలాలు, కాలువలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. మండలంలోని వాడనర్సాపురం సమీపంలో ఎన్ఏటీబీ ఏర్పాటు కావడంతో రాంబిల్లి, గోవిందపాలెం, వాడనర్సాపురం గ్రామాల్లో అధికంగా దుకాణాలు, హోటళ్లు, చికెన్,చేపలు విక్రయాల షాపులు వెలిశాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఈ ప్రాంతాల్లో అధిక సంఖ్యల్లో అద్దెకు ఉంటున్నారు. వ్యాపారులు తమ షాపుల్లోని వ్యర్థాలను రోడ్డుపక్కన, కాలువల్లోను రాత్రి సమయంల్లో వేస్తూ డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నారు. ఇళ్లలోని చెత్తను కూడా రోడ్ల పక్కనే వేసేస్తున్నారు. దీంతో రోడ్లపై వెళుతుంటే దుర్వాసన వెదజలుతున్నదని వాహన చోదకులు అంటున్నారు. మాంసం, చికెన్, చేపల దుకాణ వ్యాపారులు వీటి వ్యర్థాలను రోడ్ల పక్కన ఎక్కడి పడితే అక్కడ డంపింగ్ చేస్తున్నారు. దీంతో చెత్త నిల్వల వద్ద కుక్కలు బెడద అధికంగా ఉండడంతో రాకపోకలు సాగించే వారు భయపడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపడుతున్న అధికారులకు రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త నిల్వలు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

16 ఏళ్లకే నూరేళ్లు..

- నీరు తోడుతుండగా బావిలో పడి బాలుడి మృతి
- జీ జగన్నాథపురంలో విషాదం



సాయి గణేశ్ (ఫైల్)

నక్కపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ జగన్నాథపురంలో 16 ఏళ్ల బాలుడు నేల బావిలో పడి మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. ఎస్ఐ సన్నిబాబు అందించిన వివరాలిలా ఉన్నాయి.

జీ జగన్నాథపురం గ్రామానికి చెంది జగతా గంగాద్రి సాయి గణేశ్ (16)ఇటీవల టెన్త్ పూర్తి చేశాడు. ఆదివారం తమ పొలంలో పశువులు మేపుతున్న తరుణంలో దాహం వేయడంతో అక్కడే వున్న నేలబావిలో డొక్కుతో నీరు తీసుకునేందుకు ప్రయత్నించి అదుపుతప్పి బావిలో పడిపోయాడు. ఈ విషయాన్ని పక్కనే వున్న కొందరు గుర్తించి కేకలు వేశారు. వీరిలో కొందరు బావిలోకి దిగి ఆ బాలుడిని బయటకు తీసి, ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యాధికారులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీంతో ఆ గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. బాలుడి తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.

పందూరు వంతెన పనులు పునః ప్రారంభం



పందూరు వంతెన వద్ద ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్న దృశ్యం

కోటవురట్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందూరు వంతెన నిర్మాణ పనులు రెండు రోజుల క్రితం మళ్లీ ప్రారంభమయ్యాయి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఈ వంతెన గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణానికి రూ.5.75 కోట్లు మంజూరు చేసింది. ఏప్రిల్ 26వ తేదీన నిర్మాణ పనులకు రాష్ట్ర హోంమంత్రి అనిత భూమి పూజ చేశారు. పందూరు వంతెన లేకపోవడంతో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఏడాది వర్షా కాలంలో వరహానది ప్రవహిస్తే చాలు ప్రయాణం చేయడానికి గ్రామస్థులు అవస్థలు పడేవారు. గత రెండు రోజుల నుంచి వంతెన నిర్మాణ పనులను అధికారుల చేపట్టారు. పనులను వేగవంతంగా చేసి వరదలకు ముందే శ్లాబ్ పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చోడపల్లిలో ఇంటింటికీ కొళాయి పనులకు శంకుస్థాపన



జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, మే 25, (ఆంధ్రజ్యోతి):గ్రామాభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని చోడపల్లి పంచాయతీ పరిధిలో జలజీవన్ పనులలో భాగంగా ఇంటింటికీ కొళాయిల పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు డస్ట్‌బిన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండిబోయిన భాను, ఆమె భర్త వెంకట్, జనసేన నాయకులు బైలపూడి రామదాసు, వడిశల సన్యాసినాయుడు, నర్మాల రామకృష్ణ, కాకి నూకరాజు, వీఆర్ఓ చిన అప్పారావు పాల్గొన్నారు.

హెరిటేజ్ డెయిరీ రైతులకు అవగాహన



రైతులను సన్మానిస్తున్న హెరిటేజ్ డెయిరీ మేనేజరు శేషు

అచ్యుతాపురం రూరల్, మే 25, (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పాల ఉత్పత్తి పెరగడానికి పాటించాల్సిన పద్ధతులను తెలుసుకొని లాభాలను ఆర్జించాలని హెరిటేజ్ డెయిరీ మేనేజరు కూండ్రపు శేషు అన్నారు. ఆదివారం మండలంలోని దొప్పెర్ల శివారు రాయగరువులో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధిక పాల దిగుబడికి డెయిరీకి అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం ఉత్తమ రైతులు కె.రవణమ్మ, కె.మాలతి, కె.పుష్పలకు ఆయన సన్మానం చేసి, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువుల ఆసుపత్రి సహాయకులు సీహెచ్.రాము, రైతులు కె.వెంకట్రావు, కె.శ్రీను, కె.సరోజిని, కె.సన్యాసిరావు, కె.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఐద్వా కార్యదర్శి రమాదేవి

మునగపాక, మే 25 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. మండలంలో తిమ్మరాజుపేటలో ఆదివారం జరిగిన రాష్ట్ర మహిళ శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. పసి పిల్లలు మొదలుకొని వృద్ధులు వరకు మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. వాటిని ధైర్యంగా ఎదుర్కొనే విధంగా మహిళల్లో చైతన్యం రావాలన్నారు. కార్యక్రమంలో వై.సత్యవతి, పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి, వాణి, సుభాషిని, సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల పండుగలు

మునగపాక, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలు పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పాటిపల్లి రోడ్డు మార్గం తంపరమూల ప్రాంతాల్లో సత్తమ్మతల్లి, ముసిలితల్లి అమ్మవార్ల పండుగలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పాటిమీద గ్రామంలో క్యాన్సర్ పరీక్షలు

నక్కపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిమీద గ్రామంలో వైజాగ్ వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవిలత పలువురు మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుసుమ కుమారి, కృష్ణవేణి తదితరులతోపాటు పాయకరావుపేట, నక్కపల్లి వికాస తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు, సుభాష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్, ధనిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సామెతలపై విద్యార్థులకు అవగాహన

నక్కపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు తెలుగు భాషలో ఉండే సామెతలు, వాటిలో ఉండే చమత్కారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

ప్రతిభావంతులను సత్కరించిన పూర్వ విద్యార్థులు



ప్రతిభావంతులతో 1995-96 పూర్వ విద్యార్థులు

మునగపాక, మే 25 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి మండల స్థాయిలో పాఠశాలకు కీర్తి, ప్రతిష్ఠలు తీసుకు వచ్చిన ప్రతిభావంతులైన విద్యార్థులను 1995-96 సంవత్సరం టెన్త్ పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఆదివారం మునగపాక జడ్పీ హైస్కూల్ జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులను వచ్చిన వారిని పూర్వ విద్యార్థులు శాలువతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి అభినందనలు చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, పూర్వ విద్యార్థులు ఎం.ఆనంద్‌బాబు, ఎం.జోగారావు, గిరీష్‌కుమార్, జగ్గఅప్పలనాయుడు, హరికుమారి, వెంకటేశ్వరరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మూలకొత్తూరులో పశువుల పాక దగ్ధం

రాంబిల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలకొత్తూరులో శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో పి.తాతారావుకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. ఇటీవలే ఈ పశువుల పాకను నిర్మించుకున్నానని, గుర్తుతెలియని వ్యక్తులు ఈ పశువుల పాకకు నిప్పు పెట్టారని రైతు వాపోయాడు. పాక తగలబడిపోతున్న సమయంలో పాకలో ఉన్న పశువులు వేడిని తట్టుకోలేక తాళ్లు తెంపుకొని పారిపోయాయన్నారు. పదిరోజల క్రితం గ్రామ పరిధిలోని ఒక రైతు పశువుల పాక కూడా కాలిపోయిందని, పశువుల పాకలకు ఎవరు నిప్పుపెడుతున్నారో తెలియడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గ్రామంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని మూలకొత్తూరు గ్రామస్థులు కోరుతున్నారు.

కృష్ణంరాజు కాలువలో తుప్పలు తొలగింపు



సాగునీటి కాలువలో తుప్పలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మునగపాక, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణంరాజు కాలువలో ఆదివారం జంగిల్ క్లియరెన్స్ పనులు మొదలయ్యాయి. పేటకట్టు రైతు సంఘం ప్రాంతం నుంచి ఎక్స్‌కవేటర్‌తో తుప్పలు తొలగింపు చేపట్టారు. ఆవ ప్రాంతం వరకు పనులు జరగనున్నాయని సంఘం అధ్యక్షుడు పెంటకోట రాము, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం వైస్.చైర్మన్ పెంటకోట శ్రీరామ్మూర్తి, డైరెక్టర్ పచ్చికూర నర్సింగరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మళ్ల సంజీవరావు, సూరిశెట్టి అప్పలనాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



కోటవురట్ల హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోటవురట్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో 2000-01 సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఆదివారం మళ్లీ కలుసుకున్నారు. హైస్కూల్ ఆవరణలో వీరంతా కలుసుకొని ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఆత్మీయ సమావేశాన్ని పూర్వ విద్యార్థులు మురళి, బీశెట్టి శ్రీనివాసరావు, సతీశ్ రెండు నెలలు శ్రమించి ఏర్పాటు చేశారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం వీరంతా ప్రతీ ఏడాది కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

కొప్పిశెట్టి వెంకటేశ్‌కి పలువురు అభినందన

పాయకరావుపేట రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన కొప్పిశెట్టి వెంకటేశ్‌కి శ్రీరాంపురం గ్రామానికి చెందిన డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ చించెలపు వెంకటకృష్ణారావు తదితరులు అభినందనలు తెలిపారు. ఆదివారం నక్కపల్లిలో వెంకటేశ్‌ని కలిసిన వెంకటకృష్ణారావు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చించెలపు కౌశిక్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కురందాసు రమణ తదితరులు పాల్గొన్నారు.

గోకులపాడుకి సిమెంట్ బెంచీలు వితరణ



గోకులపాడులో ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలు

ఎస్.రాయవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోకులపాడుకి చెందిన నాగంబోయిన నాని ఏజీ ఫౌండేషన్ ద్వారా గ్రామానికి 12 సిమెంట్ బెంచీలను వితరణగా అందజేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఏజీ ఫౌండేషన్ 12 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు మహిళా రైతులను గ్రామ పెద్దలు నాగంబోయిన శ్రీను, శేషు, ఫణి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగంబోయిన శేషారావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు నక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

27న శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర

మునగపాక, మే 25 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర ఈనెల 27వ తేదీన మునగపాక నుంచి ప్రారంభమవుతుందని తిమ్మరాజుపేట సత్యసాయి భజన మండలి కన్వీనర్ సరిసా శివ గణేష్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు మునగపాక నుంచి బయలుదేరి తిమ్మరాజుపేట మీదుగా హరిపాలెం, కొండకర్ల, అచ్యుతాపురం, మడుతూరు, వెదురువాడ, రాంబిల్లి వరకు కొనసాగుతుందన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ మొబైల్ వాహనాల రద్దు హర్షణీయం

నర్సీపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ మొబైల్ వాహనాలు రద్దు చేసి పాత విధానంలో సరకుల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని నర్సీపట్నం రేషన్ డీలర్లు అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది పెట్టకుండా ఇంటికి వెళ్లి రేషన్ సరకులు పంపిణీ చేయాలని సూచించారు.

డిగ్రీ విద్యార్థులకు స్పీకర్ అభినందనలు

నర్సీపట్నం: డిగ్రీ ఫలితాల్లో మొదటి, ద్వితీయ ర్యాంకులు సాధించిన అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు. ఏయూ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన చీమల దుర్గాప్రసాద్, రెండో ర్యాంక్ సాధించిన అనిమిరెడ్డి సత్యహేమలతకు ఆయన అభినందనలు తెలిపారు. ఏయూ స్థాయిలో ఎన్నో డిగ్రీ కళాశాలలు ఉండగా నర్సీపట్నం విద్యార్థులు మొదటి, ద్వితీయ ర్యాంకులు సాధించిన విశేషమన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



రాయితీపై పశుదాణా అందిస్తున్న తాండవ చైర్మన్ సత్యనారాయణ తదితరులు

నాతవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పాడి రైతులకు రాయితీపై పశుదాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మొదటి విడతలో 12.5 టన్నుల పశుదాణా వచ్చిందన్నారు. 50 కిలోల బస్తా రూ.1110 కాగా, ప్రభుత్వం రూ.555కే రాయితీపై అందిస్తున్నదని చెప్పారు. అలాగే పాడిరైతుల కోసం ప్రభుత్వం గోశాలలను కూడా మంజూరు చేస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి మోక్షరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, తెలుగుయువత మండల అధ్యక్షుడు శెట్టి లోవ, జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షుడు ఇటంశెట్టి సీతారామ్మూర్తి, నాయకులు పైల సూరిబాబు, అపిరెడ్డి మాణిక్యం, జీరెడ్డి రాజుబాబు, పారుపల్లి దాసు, సుర్ల వెంకటరమణ, శెట్టి సత్యనారాయణ, రంభా సత్యనారాయణ పాల్గొన్నారు.

సెలవు దినంలోనూ స్వర్ణ పంచాయతీ

చోడవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పంచాయతీ సమగ్ర వివరాలు నమోదు చేసే స్వర్ణ పంచాయతీ కార్యక్రమాన్ని మండలంలో పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరి ఇంటి వివరాలు సర్వే నంబరు పక్కా కొలతలతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆదివారం వెంకన్నపాలెం పంచాయతీలో కార్యదర్శి గంగాధర్ స్వర్ణ పంచాయతీ వివరాలు నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో ఇళ్ల యజమానులు తమ ఇంటి వివరాలు చూసుకోవడంతోపాటు, ఇంటి పన్ను కూడా ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఈ ప్రక్రియ అన్ని పంచాయతీల్లో జోరుగా సాగుతున్నది.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు

బుచ్చెయ్యపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.భీమవరం, చినభీమవరం, రాజాం గ్రామాల్లో వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. పెందుర్తి ఎమ్మెల్యే, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు ఆదివారం వడ్డాదిలో వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్.భీమవరం నుంచి కవలల సతీష్, పదవ వార్డు మెంబరు రాజాన చినఅప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్ చిలుకు రాజు, ఎస్ఎంసీ చైర్మన్ మందపాక మంగ, శ్రీను, వి.అప్పలనాయుడు, తదితరులు జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, సీనియర్ నేత అడపా నర్సింహమూర్తి, జనసేన పట్టణ అధ్యక్షుడు దొండ సాయి పాల్గొన్నారు.

వడ్డాదిలో ముగిసిన సమ్మర్ క్యాంప్

బుచ్చెయ్యపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కేపీడీ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులకు తైక్వాండో, యోగా, ఇతర క్రీడలపై 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థులు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో కోచ్‌లు గండెం వెంకటేష్, పీటర్ రాంబాబు, లక్ష్మి, అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు, వాకర్స్ సభ్యులు, దొండా నరేష్ పాల్గొన్నారు.

జాతీయ రెల్లి కుల ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'మామిడి'



బుచ్చెయ్యపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రెల్లి కుల ఎస్సీ గ్రూపు సంక్షేమ సంఘం ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడి అర్జునరావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ రెల్లి ఎస్సీ గ్రూపు సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ భూపతి అప్పారావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనను ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్టు అర్జునరావు కృతజ్ఞతలు తెలిపారు. అర్జునరావును పలువురు రాష్ట్ర రెల్లికుల నాయకులు అభినందించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

రావికమతం, మే 25 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న బంగారం ఆభరణం 14 రోజుల తరువాత తిరిగి ఇచ్చిన ఆటో డ్రైవర్ నిజాయితీని పలువురు అభినందించారు. కొత్తకోటకు చెందిన శ్రీ శాంతి ఆటో యూనియన్ సభ్యుడు కొప్పు శ్రీనివాస్ నర్సీపట్నం నుంచి కొత్తకోటకు ప్రయాణికులతో వచ్చాడు. ప్రయాణికులు దిగిపోయిన తర్వాత పావుతులం బంగారుపు లాకెట్టు ఆటోలో పడి ఉండడాన్ని గుర్తించిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ దానిని భద్రపరిచారు. దీనిపై విచారణ అనంతరం నర్సీపట్నంలో ఆటో ఎక్కిన చెట్టుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినికి చెందినదని నిర్ధారించుకున్నారు. ఈ విద్యార్థిని గుంటూరులో మెడిసన్ చదువుతుండడంతో ఆమె తండ్రి రాముకు ఆదివారం కొత్తకోటలో యూనియన్ సభ్యుల సమక్షంలో ఆభరణం అందజేశారు.

రేషన్ డీలర్ల పొట్టకొట్టిన వైసీపీ ప్రభుత్వం

» అసోసియేషన్ మండల అధ్యక్షుడు గొల్లు నాయుడు

రోలుగుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ ఎండీయూ వాహనాలు రద్దు చేయడంపై మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజును కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు గొల్లు నాయుడు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో అనాలోచితంగా తెచ్చిన రేషన్ వాహనాల వల్ల అనేక సమస్యలను ఎదుర్కొన్నామన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం డీలర్ల పొట్ట కొడితే నేడు కూటమి ప్రభుత్వం ఆదుకుందన్నారు. నెలలో 15వ తేదీ లోగా లబ్ధిదారులు ఎప్పుడు వచ్చినా సరుకులు ఇస్తామని తెలిపారు. 24 పంచాయతీల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

ఆర్వో ప్లాంట్‌లో పాట్లు

- ఎన్టీఆర్ సుజల పథకం వద్ద కాయిన్ బాక్స్ మిషన్
- మిషన్‌లో రూ.2 నాణెం వేసి నీరు పట్టుకోవాలి
- శుద్ధ జలానికి వచ్చే వారు రోజుకు 400 మందిపైనే
- 20 లీటర్ల డబ్బా నిండడానికి అధిక సమయం నిరీక్షణ
- మరో మిషన్ ఏర్పాటు చేయాలని ప్రజల విన్నపం



ఆర్వో ప్లాంట్ వద్ద తాగునీటి కోసం క్యూ కట్టిన జనం

నర్సీపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మినీ స్టేడియం ఆవరణలోని సుజల పథకం వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌లో ప్రజలు పానీపట్టు యుద్ధం చేస్తున్నారు. ఇక్కడ శుద్ధ జలం పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన ఒక కాయిన్ బాక్స్ మిషన్ సరిపడక పానీ పాట్లు పడుతున్నారు. రోజుకు 400 మంది జనాలు వస్తుండగా, ఉన్న ఒక్క బాక్స్‌తో నీరు పట్టుకోవడానికి క్యూలో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015లో ఎన్టీఆర్ మినీ స్టేడియం స్థలంలో ఎన్టీఆర్ సుజల పథకం మంజూరు చేశారు. ప్రజలకు రూ.2కే 20 లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. పట్టణంలోని బలిఘట్టం, పెదబొడ్డేపల్లి, నర్సీపట్నంలో వెంకునాయుడుపేట, కొత్తవీధి, కాపువీధి, మునిసిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న మునిసిపాలిటీ మినీ వాటర్ స్కీమ్‌ల వద్ద ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు రూ.2కే 20 లీటర్లు శుద్ధి చేసిన జలాలు అందించాలని ప్రైవేటు వ్యక్తులకు సులజ పథకాలు అప్పగించారు.

ఆర్వో ప్లాంట్‌లకు సంబంధించి విద్యుత్ బిల్లు మునిసిపాలిటీ భరిస్తున్నది. అదే విధానంలో కొప్పర్తి రామారావు చారిటబుల్ ట్రస్టు పేరుతో ఎన్టీఆర్ మినీ స్టేడియం స్థలంలో భవనం నిర్మించి, అందులో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించడానికి ట్రస్టు ప్రతినిధి రామారావు ముందుకు వచ్చారు. కొద్ది రోజుల క్రితం ఈ ఆర్వో ప్లాంట్ దగ్గర నిర్వాహకులు కాయిన్ బాక్స్ మిషన్ ఏర్పాటు చేశారు. మిషన్‌లో రూ.2 నాణెం వేస్తే పైపుల నుంచి నీరు వస్తున్నది. అయితే ఇక్కడ శుద్ధి చేసిన నీటి కోసం ప్రతి రోజూ 400 మందికిపైగా జనం వస్తున్నారు. వీరంతా ఒక్క మిషన్ ద్వారా నీరు పట్టుకోవడానికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క మిషన్ వల్ల 20 లీటర్ల డబ్బాలు పట్టుకొని గంటల తరబడి క్యూలో ఉండాల్సి వస్తున్నదని, ఈ క్రమంలో నీరసించిపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నిర్వాహకులు తక్షణమే స్పందించి మరో కాయిన్ బాక్స్ మిషన్ ఏర్పాటు చేసి తమ కష్టాలు తీర్చాలని వారు వేడుకుంటున్నారు.

భారీ వర్షం

కృష్ణాదేవిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి, చోద్యం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో ఉదయం నుండి మండుటెండతో అల్లాడిపోయిన ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఉదయం ఎండ భయపెట్టగా, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణ మారిపోయి ఉరుములతో వర్షం పడింది. ఈ వర్షంతో గ్రామీణ ప్రాంతాల ప్రధాన రహదారులు, వీధి రోడ్లు డ్రైనేజీలు లేక వర్షం నీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. దీంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా ఏఎల్‌పురం ఆర్టీసీ బస్ స్టేషన్ చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



ఏఎల్‌పురం ప్రధాన రహదారిలో కురుస్తున్న వాన

విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

» నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు



వాకర్స్ క్లబ్ కార్యదర్శికి డోనర్ సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం కొరత అధికంగా ఉంటుందని, వివిధ స్వచ్ఛంద సేవా సంఘాలు ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలను విరివిగా నిర్వహించాలని నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు సూచించారు. ఎన్టీఆర్ మినీస్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రాంతీయ ఆస్పత్రి బ్లడ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా రక్తదాన శిబిరాలు పెట్టినప్పుడు యువత ఎక్కువగా కనిపిస్తారని, అందుకు భిన్నంగా యాభై ఏళ్ల పైబడిన వారు రక్తం ఇవ్వడానికి ఉత్సాహంగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. వాకర్స్ క్లబ్ సభ్యులు స్టేడియం పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా బ్యాంక్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ, వాకర్స్ క్లబ్ సెక్రటరీ కామిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కుప్పిలి శ్రీనివాసరావు, ఎంవీ రంగారావు, జాయింట్ సెక్రటరీ పిట్ల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి వాకాడ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వివాహ పెండ్లి రాట మహోత్సవం

కృష్ణాదేవిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహించనున్న సామూహిక వివాహ మహోత్సవ ముహూర్త పెండ్లి రాట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణాదేవిపేటలోని తంగేటి వెంకట పద్మావతి కల్యాణ మండలంలో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు జరగనున్న ఆదివాసీల సామూహిక 108 జంటల వివాహ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ వివాహాలకు చినజీయర్ స్వామి హాజరుకానున్నారు. దీనికి సంబంధించి పెండ్లి రాటను అర్చకులు భద్రాద్రి రాముడు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దానధర్మ చారిట్రబుల్ ట్రస్టు ప్రతినిధులు రాట్నాల సూర్య, డీవీడీ ప్రసాద్, లోకుల కిరణ్, కొండబాబు, గిరిబాబు,పద్మరాజు, రామకృష్ణ, హైందవ సైన్యం వ్యవస్థాపకులు పెనుగొండ దుర్గాప్రసాద్, పాడేరు ఏఎంసీ చైర్‌పర్సన్ మంగతల్లి, నాయకులు లింగమూర్తి, మల్లేశ్ పాల్గొన్నారు.

29న కొత్తకోటలో దుకాణాలకు వేలం పాట

రావికమతం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట కేశవస్వామి, రాజలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన మూడు దుకాణాలకు ఈ నెల 29న వేలం పాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కిరణ్మయి తెలిపారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం ఒంటి గంటకు వేలం పాట ప్రారంభిస్తామని చెప్పారు. పాటలో పాల్గొనే వారు రూ.5 వేల దరావతు చెల్లించడంతో పాటు పాటదారు ఆధార్ కార్డు జెరాక్స్, రూ.లక్ష సాలవెన్సీ సర్టిఫికెట్ తీసుకురావాలని తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి పాటలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా బోగొండమ్మ ఒడ్డు పండుగ

చీడికాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరంలో బొగొండమ్మ ఒడ్డు పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సబ్బవరపు మరిడయ్య నిర్వహించిన ఈ పండుగకు భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు కుచ్చు కళావతి, బండారు దయాకర్, సింగంపల్లి శ్రీరామ్మూర్తి, సింగంపల్లి పెదనాయుడు, సింగంపల్లి శ్రీను, మరిడయ్య పూజలు చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

రోలుగుంట, మే 25(ఆంధ్రజ్యోతి): రోలుగుంటలో స్థానిక పీహెచ్‌సీ వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 112 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించగా 53 మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని నిర్ధారించారు. వీరిని శస్త్ర చికిత్స నిమిత్తం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సురేష్, క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముత్యమాంబను దర్శించుకున్న 'బూడి'

దేవరాపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురంలో ముత్యమాంబ అమ్మవారిని మాజీ ఉపముఖ్యమంత్రి బూడి.ముత్యాలనాయుడు ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల వెంకటరమణ, కాశీపురం వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో వర్షం

దేవరాపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): పలు మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. దేవరాపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ విపరీతంగా కాసింది. సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం వరి నారుమడులకు, కూరగాయలకు, సరుగుడు మొక్కలకు ఉపయోగపడుతుందని అంటున్నారు.

చీడికాడలో..

చీడికాడతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న జనం ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

రావికమతంలో..

మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందిరు. రోజూ వర్షం కురవడం వలన వరి నారుమడులు తయారు చేసేందుకు ఆటంకంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రావికమతంలో కురుస్తున్న వర్షం

మాడుగులలో..

మండల కేంద్రంలో ఆదివారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాతావరణం చల్లగా ఉంది. దీంతో ప్రజలు వేసవి తాపం నుంచి కాస్త ఉపశమనం పొందారు.

నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలు ఏర్పాటు

» జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు



రమేశ్‌బాబు సమక్షంలో జనసేనలో చేరిన నేతలు

మాడుగుల రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ రూరల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో త్వరలో కొత్తగా సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తామని జనసేన పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ అన్నారు. ఆదివారం కింతలి వల్లాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. గ్రామస్థాయి నుంచి జనసైనికులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు కార్యక్రమానికి విచ్చేశారు. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వల్లాపురం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పీవీఎస్ఎన్ రాజు, గంగులయ్య, రాజన్న, సూర్యచంద్ర, దేవి త్రివేణి, లక్ష్మీచౌదరి, కళావతి, సురేఖ, రాయపురెడ్డి కృష్ణ, గుమ్మడి శ్రీరామ్, శివాజీ, అచ్యుతరావు, అశోక్, మహేశ్, కోన శ్రీను నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రావికమతం, మే 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుకున్న 2005 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 20 ఏళ్ల తరువాత రావికమతం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో చిలిపి చేష్టలు, ఉపాధ్యాయుల విద్యాబోధన, చదువులో టాప్ విద్యార్థుల వివరాలు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఏ రంగాల్లో స్థిరపడిందన్న విషయాలను తెలియజేసుకున్నారు.

మోదకొండమ్మ జాతర పోస్టర్ విడుదల



మోదకొండమ్మ జాతర పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల, మే 25 (ఆంధ్రజ్యోతి):మాడుగుల మోదకొండమ్మ జాతర జూన్ 3వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో పాత, కొత్త కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు, పైడినాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మాకు దారి చూపించండి'

చోడవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి స్థలంతో పాటు, పంట పొలాలకు వెళ్లే దారిని మూసివేస్తూ చెత్త సంపద కేంద్రం చుట్టూ వేసిన కంచెను తొలగించాలని మండలంలోని పీఎస్‌పేట గ్రామానికి చెందిన మజ్జి వెంకటలక్ష్మి తహసీల్దార్‌ను కోరారు. మండలంలోని జన్నవరంలో తనకు కొంత పొలం ఉందని, తనతోపాటు ఆ మార్గంలో అనేకమంది రైతుల పొలాలు కూడా ఉన్నాయన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతులంతా ఆ స్థలంలో నుంచే రాకపోక చేస్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇటీవల చెత్త సంపద కేంద్రం స్థలం రహదారిని మూసివేస్తూ కంచె వేశారని, దీనివల్ల రైతులు పొలాల్లోకి అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మజ్జి వెంకటలక్ష్మి తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొమిర గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

రావికమతం, మే 25 (ఆంధ్రజ్యోతి): కొమిర గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. ఆదివారం కొమిర గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను ఆయన దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. కేఎం చానల్ ఉన్నప్పటికీ పెద్దేరు రిజర్వాయర్ నీరు గ్రామానికి చుక్క నీరు కూడా రావడం లేదని పేర్కొన్నారు. గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఈ సమస్యను వివరించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అలాగే ఉర్లల్లోవ కొండలో 270 మంది నిరుపేదలకు డి పట్టాలిచ్చినా ఆ భూములను వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయకపోవడంతో ప్రభుత్వ రాయితీలకు నోచుకోలేకపోతున్నామని రైతులు రాజు దృష్టికి తెచ్చారు. పాఠశాల భవనం ప్రమాదభరితంగా ఉండడంతో విద్యార్థులకు తరగతులను ఆలయంలో కొనసాగిస్తున్నామని, పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. కొమిర సమస్యలను ఉపముఖ్యమంత్రి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జనసేన నాయకుడు రాజు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మైచర్ల నాయుడు, రామునాయుడు, శంకర్, పాలసంఘం అధ్యక్షుడు గొర్లె సత్యనారాయణ, జనసైనికులు కాటంరెడ్డి కన్నబాబు, పెంటయ్య, బాల, టీడీపీ నాయకులు గొంతిన కృష్ణ, కరణం ఈశ్వరరావు పాల్గొన్నారు.

కాలినడకన పాడేరు మోదకొండమ్మ పాదాలకు భక్తులు

మాడుగుల, మే 25 (ఆంధ్ర జ్యోతి): మాడుగుల మోదకొండమ్మ జాతర పురస్కరించుకొని అమ్మవారి మాలధారణ చేసిన భక్తులు ఆదివారం కాలినడకన పాడేరు మోదకొండమ్మ పాదాల వద్దకు చేరి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా పాదయాత్రగా వెళ్లి భక్తిభావం చాటుకున్నారు. కాలినడకన వెళ్లిన భక్తులకు దారిపొడవునా వివిధ గ్రామాల ప్రజలు చల్లదనంగా పసుపునీళ్లను రోడ్లపై చల్లారు.

ఒకే పూవ్వు.. మూడు వర్ణాల్లో..

» ఆకట్టుకుంటున్న హైడ్రెంజ పుష్పం



చింతపల్లి చర్చి ఆవరణలో హైడ్రెంజ పుష్పం

చింతపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఆదివాసీ ప్రభావిత పథం చర్చి ఆవరణలో హైడ్రెంజ పూలు(రంగుల పుష్పం) ఆకట్టుకుంటున్నాయి. ఏడాదిలో ఒకసారి వికసించే ఈ పూవునకు ప్రత్యేకత వున్నది. మూడు నెలలపాటు ఆకర్షణీయమైన మూడు వర్ణాల్లో కనిపిస్తుంది. ఒక నెలలో పువ్వులు ఊదా రంగులో, మరో నెలలో గులాబీ, తర్వాత తెలుపు, ఆకుపచ్చ వర్ణంలో కనువిందు చేస్తుంది. ఈమొక్క స్వస్థలం ఉత్తర అమెరికా, ప్రస్తుతం హైడ్రెంజను పలు దేశాల్లో గార్డెన్ అలంకరణ పెంచుతారు. ఐదేళ్ల క్రితం పాస్టర్ డి. డేవిడ్ జపాన్ నుంచి ఈ మొక్కను తీసుకువచ్చి పెరట్లో పెంచుతున్నారు. ఈ పుష్పాలను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి



హనుమన్ శోభయాత్రలో సాయిరామ్ సామిజీ

జి.మాడుగుల, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు భక్తి భావాలు పెంపొందించుకోవాలని స్థానిక గాంధీనగర్ పంచముఖ అంజనేయ ఆలయ స్వామిజీ సూచించారు. శ్రీహనుమన్ జయంతి పురష్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన శోభయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. భక్తితో ముక్తి చేరుతుందని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎం.మత్స్యరాజు, కె.రాంబాబు తదితర భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

జి.మాడుగుల, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూల గ్రామాల గిరిజనులకు ఉచితంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తునట్లు ఆంధ్ర వనవాసీ కల్యాణ్ ఆశ్రమం వైద్యాధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో శని, ఆదివారాలు రెండు రోజులుగా మారుమూల బొయితిలి, కిల్లంకోట పంచాయతీల్లో రాసవీధి, గొందిపల్లి, కోడిమామిడి గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

'గిరిజన' ఉపాధ్యాయులకు బదిలీల చట్టాన్ని వర్తించాలి

పాడేరురూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో వి ధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు బదిలీల చట్టాన్ని వర్తింప చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం బదిలీల చట్టాన్ని తీసుకువచ్చిందని, దీనిని గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయులకు వర్తింప చేయకపోవడం అన్యాయమన్నారు.

ఒకటో తేదీ నుంచి లంబసింగి రాకాసమ్మ జాతర



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చింతపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో లంబసింగి రాకాసమ్మ జాతర జూన్ ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ జాతర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మూడు రోజులూ ఆలయంలో ప్రత్యేక పూజలు, అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం భజన, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి



మాట్లాడుతున్న పెసా కమిటీ అధ్యక్షుడు బలరామ్

గూడెంకొత్తవీధి, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పెసా కమిటీ అధ్యక్షుడు కొర్ర బలరాము కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యారన్నారు. కలెక్టర్ ప్రభుత్వ భూములను సర్వేచేపట్టి, ఆక్రమణలను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు.ఇకనైనా స్పందించకుంటే గ్రామ సభల్లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈకార్యక్రమం లో మండల పెసా ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



కొండచిలువను దహనం చేస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగళ్లగొంది లో పశువుల కాపరులు కొండచిలువను హతమార్చారు. ఆది వారం గ్రామానికి చెందిన గిరిజనులు పశువుల మందను మేత కోసం అడవికి తీసుకు వెళ్లారు. మధ్యాహ్నంమేకల వద్దకు కొండ చిలువ వ చ్చింది. గమనించిన కాపరులు కర్రలు, ఈటెతో హతమార్చారు. అనంతరం దహనం చేశారు.



డ్రైనేజీ నిర్మించి, నీరు పోయేలా దారిలేకుండా వదిలేసిన ఉంచిన దృశ్యం



డ్రైనేజీ అంతర్భాగంలో అస్తవ్యస్తంగా నిర్మాణ పనులు

అస్తవ్యస్త డ్రైనేజీలు.. మురుగు నీటి నిల్వతో అవస్థలు

» జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యతా లోపం

» కాలువల్లో దుర్గంధం » గ్రామాల్లో దోమలు వ్యాప్తి

కొయ్యూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పలు గ్రామాల వద్ద డ్రైనేజీల అస్తవ్యస్తంగా నిర్మాణం చేసి వదిలేయడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడింపాలెం వద్ద డ్రైనేజీ కేవలం గ్రామానికి 10 అడుగుల దూరం మేరకు నిర్మించి, మురుగు నీరు సాఫీగా పోయేలా తగిన రీతిలో కాలువ తీయకుండా వదిలేశారు. ఫలితంగా మురుగు నీరు గ్రామానికి ఆనుకుని నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లటంతోపాటు దోమలు విజృంభిస్తున్నాయి. దీనికి తోడు డ్రైనేజీ అంతర్భాగం నిర్మాణాల్లో నాణ్యత కొరవడంతో వేసిన కాంక్రీట్ విరిగి రంధ్రాలు పడుతున్నాయి. ఈ స్థితిలో సుమారు నాలుగు నెలలుగా పిట్టచలం వద్ద పనసలపాడుకు వెళ్లే మార్గానికి మధ్యలో నిర్మించిన డ్రైనేజీపై వేసిన పలకలు విరిగి వాహన రాకపోకలకు అంతరాయం నెలకొంటోంది. తోటలూరు వద్ద డ్రైనేజీ విద్యుతు స్తంభం వేసేందుకు వీలుగా నిర్మాణాలు నిలిపేశారు. అనంతరం రోడ్డు నిర్మాణం పూర్తయినా అక్కడ అసంపూర్తిగా ఇతరాత్ర పనులను వదిలేశారు.ఈ గ్రామంలో మురుగు నీరు వెళ్లే మార్గం లేక దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇలా జాతీయ రహదారి ఆనుకుని ఉ న్న ప్రతీ గ్రామంలోనూ డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధి కారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణాల్లో లోపాలను సరిచేసి, మురుగునీరు సమీప కొండవాగులకు, లేదా గ్రామానికి దూరంగా ప్రవహించేందుకు వీలు గా మార్గం ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై స్పందించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు పందిరి రాట



నక్కలపుట్టులో పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిండంగి పంచాయతీ నక్కలపుట్టు గ్రామంలో గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు మోదకొండమ్మ తల్లి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేసినట్టు పంచాయతీ సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి తెలిపారు. గ్రామంలో అమ్మవారి ఉత్సవాలను జూన్ 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పీపీ సొనారి రత్నకుమారి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ఆలయ స్థలధాత, మాజీ సర్పంచ్ డుంబేరి నారాయణమ్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మొస్యా పాలవెల్లి, మాజీఎంపీపీ ఎస్‌వీవీ.రమణమూర్తి, తెలుగు యువత నాయకుడు డుంబేరి విశ్వనాథం, గుజ్జెలి కనకరాజు, బుక్క జగదీశ్, పాపారావు, గ్రామ పెద్దలున్నారు.

స్పెషల్ డీఎస్సీ సాధన దీక్షలకు మహిళల మద్దతు



స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ దీక్షల్లో ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు

పాడేరురూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి):షెడ్యూల్ ప్రాంత నిరుద్యోగ యువతకు స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని, జీవో- 3కు ప్రత్యామ్నాయ జీవో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు మద్దతుగా ఉద్యోగులతో పాటు గిరిజన మహిళలు వారి చిన్నారులతో శిబిరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కూర్చుని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పణకు చర్యలు చేపట్టాలని, ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలను ఆదివాసీలతో భర్తీ చేయాలని కోరారు.

ఉడెన్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ కష్టాలు

» గంటల తరబడి నిలిచిపోయిన వాహనాలు

» పర్యాటకులకు తప్పని అవస్థలు



ఉడెన్ బ్రిడ్జి వద్ద ఆదివారం ట్రాఫిక్ అంతరాయంతో నిలిచిన వాహనాలు

అరకులోయ, మే 25 (ఆంధ్రజ్యోతి): అరకు- విశాఖ ప్రధాన రహదారి సుంకరమెట్ట సమీపంలోని కాఫీ తోటల వద్ద ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఉడెన్ బ్రిడ్జి వద్ద ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇక్కడి అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులు తమ వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు ఏపీఎఫ్‌డీసీ అధికారులు రోడ్డును ఆనుకుని ఉన్న కొండను తవ్వి గ్రావెల్‌ను రోడ్డు పక్కన వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీని వల్ల పర్యాటకులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. వేసవి సెలవులు కావడంతో అరకు అందాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు సొంత వాహనాల్లో రోడ్డు మార్గం గుండా భారీగా తరలివస్తున్నారు. ఉడెన్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పార్కింగ్ పనులను వేగంగా పూర్తి చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వాహన తనిఖీలు



సీతగుంటలో వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ

పెద బయ లు, మే 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్ ఐ కొల్లి రమణ అ న్నారు. ఆదివారం సిబ్బందితో సీత గుంటలోని ఏవోబీ వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనచోదకుల వాహన ధ్రువపత్రాలు, లైసెన్సుల వివరాలు పరిశీలించారు. లగేజీ బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. గుర్తింపు కార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ రమణ మాట్లాడుతూ మావోయిస్టుల నిరోధం, గంజాయి నిర్మూలనే ధ్యేయంగా తనిఖీ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

అనంతగిరి: హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం సాగించాలని, స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు వాహనదారులకు సూచించారు. ఎస్పీ అమిత్‌బర్దర్, డీఎస్పీ షెహబాజ్ ఆదేశాల మేరకు... మండల కేంద్రంలోని ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఐ హెల్మెట్ ధరించకపోవడంతో పలు ప్రమాదాల్లో యువకులు మృత్యువాతపడుతున్నారని అవగాహన కల్పించారు. వాహనాలకు రికార్డులులేనివారి జరిమానా విధించారు. పోలీసులు పాల్గొన్నారు.

కూలిన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రహరీ గోడ



సీతగుంటలో వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ

చింతపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఓవైపు ప్రహరీ గోడ కూలిపోవడం వల్ల విద్యార్థినులు, నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. వేసవి సెలవులు ముగుస్తున్నప్పటికి గిరిజన సంక్షేమశాఖ అధికారులు ప్రహరీ నిర్మాణానికి కనీస చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నది. మూడు నెలల క్రితం ప్రహరీ కూలిపోయింది. బాలికలు విద్యాభ్యాసం చేస్తున్న ఈ పాఠశాలలో ఓవైపు ప్రహరీ పోవడంతో కొంత మంది ఆకతాయిలు విద్యార్థినులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. దీంతో రాత్రివేళ ఆకతాయిలు పాఠశాల వద్దకు రాకుండగా, బాలికలు బయటకు వెళ్లిపోకుండగా జా గ్రత్తలు విషయంలో ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది. అలాగే పశువులు, మేకలు, కుక్కలు, పందులు పాఠశాల ఆవరణలోకి చొరబడి పరిసరాలను పాడుచేస్తున్నాయి. మరో 20 రోజుల్లో పాఠశాల పునఃప్రారంభంకానున్నది. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డుంబ్రిగుడలో జోరుగా అక్రమ నిర్మాణాలు



రోడ్డు పక్కన పరదాల చాటున నిర్మిస్తున్న కట్టడాలు

డుంబ్రిగుడ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు పంచాయతీ కేంద్రం లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. జాతీయ రహదారికి ఆనుకుని గిరిజనేతరులు అక్రమ శాశ్వత దుకాణాలు నిర్మిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. గిరిజన చట్టానికి విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ కట్టడాలను నిలుపుదల చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ అండదండాలతో గిరిజనేతరులు అక్రమ కట్టడాలను పరదాల చాటున నిర్మిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఆర్ఐ రాము వద్ద ప్రస్తావించగా.. అక్రమంగా గిరినేతరులు శాశ్వత దుకాణాలు నిర్మిస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పాడేరులో 34.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, మే 25(ఆంధ్రజ్యోతి): మన్యంలో వర్షాల ప్రభావం ఉన్నప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. ఏజెన్సీలో ప్రస్తుతం శీతాకాలం, వర్షాకాలాన్ని తలపించే వాతావరణమున్నా ఎండల ప్రభావం తగ్గడం లేదు. దీంతో గరిష్ఠ ఉ ష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం పాడేరులో 34.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, పెదబయలులో 33.5, కొయ్యూరులో 31.7, డుంబ్రిగుడలో 30.7, అనంతగిరిలో 30.5, హుకుంపేటలో 30.3, అరకులోయలో 29.9, చింతపల్లిలో 29.8, జి.మాడుగుల, జీకేవీధిలో 28.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెదబయలు, మే 25 (ఆంధ్రజ్యోతి): నేడు పీహెచ్‌సీ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలోని వైద్య నిపుణులతో రోగులకు వైద్య పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. అన్ని కంటి విభాగాలకు అత్యాధునిక కంటి పరికారాలతో చికిత్స అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్స అనంతరం తిరిగి తీసుకువస్తారన్నారు. రోగులు ఆధార్, ఆరోగ్య శ్రీ కార్డులతో హాజరుకావాలని సూచించారు.

'ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి'

పెదబయలు, మే 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నుంచి గిరిజనులకు మినహాయించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ సభ్యుడు కూడా రాధాకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక గిరిజనసంఘం భవనంలో డీఎస్సీ అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల చివరిలో పాడేరు రానున్న నేపథ్యం ఆయన పర్యటన కన్నా ముందే గిరిజన అభ్యర్థులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీవో 3ను పునరుద్ధరించాలన్నారు. ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగాలను గిరిజనులతోనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జంపరంగి సునీల్‌కుమార్, మెండిపల్లి చిరంజీవి, చెట్టి ప్రభాకర్, నరంజి దిలీప్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయం రద్దీ



అమ్మవారి సన్నిధిలో భక్తులు

పాడేరురూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాలతోపాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో రద్దీ నెలకొంది. ఇటీవల జరిగిన అమ్మవారి పండగకురాలేని వారు ఈ వారం వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.వెంకటరమణ, సీహెచ్. రామకృష్ణ, దన్నేటిపలాసి రాము, జి.శంకరరావు, టి.ఈశ్వరరావు, కె.వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్ పాల్గొన్నారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్దగల అమ్మవారి పాదాలకు మైదాన ప్రాం తానికి చెందిన భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రభుత్వ టీచర్లకు గడ్డు పరిస్థితి

... 5వ పేజీ తరువాయి

ఈ రెండు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఆయా ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో సంవత్సరాల తరబడి పనిచేసి, మైదాన ప్రాంతానికి వచ్చిన ఉపాధ్యాయులు మళ్లీ ఏజెన్సీకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఉపాధ్యాయ సంఘాలు కూడా స్పందించాలని కోరుతున్నారు.

సర్వర్‌తో సమస్యలు

... 5వ పేజీ తరువాయి

స్కూల్ అసిస్టెంట్లలో సబ్జెక్టు వారీగా నిష్పత్తి ఎంత అనేది ఇంతవరకు చెప్పలేదు. సర్దుబాటు ద్వారా మిగులుగా చూపించిన స్కూల్ అసిస్టెంట్లను మాత్రమే మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తారా? అన్నదానిపై స్పష్టత లేదు. ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి కావాలన్న నిబంధన మేరకు 2017 ఆగస్టు 31 తేదీని ప్రామాణికంగా తీసుకున్నారు. దీంతో ఆ మరుసటి రోజు అంటే 2017 సెప్టెంబరు ఒకటిన పాఠశాలల్లో చేరిన టీచర్లకు ఎనిమిదేళ్ల సర్వీస్ పాయింట్లు వర్తించవని విద్యాశాఖ మార్గదర్శకాలు ఇవ్వడంతో అప్పట్లో పలు కారణాలతో ఒకరోజు ఆలస్యంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు పూర్తిగా సర్వీస్ పాయింట్లు రావడం లేదని గుర్తు చేస్తున్నారు.

అదేవిధంగా 2017లో జరిగిన బదిలీల్లో ఒక పాఠశాలకు వచ్చిన టీచర్లు కొందరు 2023లో అమలులోకి వచ్చిన జీవో నంబర్-117 మేరకు మరోచోటకు బదిలీ కావాల్సి వచ్చింది. 2023 నుంచి ఇప్పటివరకు అదే స్కూల్‌లో పనిచేస్తున్న వారంతా జీవో నంబర్-117 రద్దుతో సర్దుబాటుకు గురయ్యారు. దీంతో సర్వీస్ పాయింట్ల కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతుందని వారు వాపోతున్నారు. బదిలీకి తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి దాని ప్రతిని సంబంధిత ఎంఈవోకు అందజేయాలి. అయితే ఆఫ్‌లైన్‌లో ఉన్న దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దరఖాస్తుతో పోల్చిన తరువాతే అప్‌లోడ్ చేయాలి. అయితే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తుల మధ్య కొన్ని పాయింట్లు తేడా వస్తోందని, దీనిపై సంబంధిత టీచర్‌ను పిలిచి మళ్లీ సవరిస్తున్నారు. స్పౌజ్ పాయింట్లు కొందరికి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదంటున్నారు.

ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్

బదిలీల దరఖాస్తుల స్వీకరణ నేపథ్యంలో నగరంలోని సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు మండలాల విద్యాశాఖాధికారులు, ఇతర సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. టీచర్లు పెట్టుకునే ఆన్‌లైన్ దరఖాస్తులతో ఎంఈవోల ద్వారా తెచ్చుకున్న ఆఫ్‌లైన్ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో దరఖాస్తుల పరిశీలన కొనసాగింది. దరఖాస్తు చేసేటప్పుడు తలెత్తే ఇబ్బందుల గురించి పలువురు ఉపాధ్యాయులు ఇక్కడకు వచ్చి డీఈవోకు వివరించారు.

రంగబోలుగెడ్డలో అక్రమ తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

ఇరిగేషన్ అధికారుల అనుమతితో తవ్వి తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చింది. దీనిని అడ్డంపెట్టుకుని కొంతమంది వ్యక్తులు మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కశింకోట మండలం ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధిలో కొత్తపల్లి బుచ్చెయ్యపేట వద్ద రంగుబోలు గెడ్డలో ఎక్స్‌కవేటర్ సహాయంతో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఐదు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని గెడ్డ నుంచి మట్టిని తరలించుకుపోతున్నారు. చెక్ డ్యామ్‌కు అతి చేరువలో భారీ గొయ్యి పడేలా మట్టిని తవ్వేశారు. దీనివల్ల చెక్ డ్యామ్‌కు ముప్పు ఏర్పడింది. గెడ్డలో చెక్ డ్యామ్ వద్ద మట్టి తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా రంగబోలు గెడ్డలో మట్టి తవ్వకాలపై జలవనరుల శాఖ ఏఈ అమూల్యకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరణ కోరగా.. గెడ్డలో మట్టి తవ్వకాల కోసం ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని, అనుమతులు సైతం ఇవ్వలేదని స్పష్టం చేశారు.

తవ్వుతున్న కొద్దీ...

... 5వ పేజీ తరువాయి

ఏడాది క్రితం అచ్యుతాపురం వచ్చి కొంతమంది స్థానిక నాయకులతో పరిచయం ఏర్పరచుకున్నాడు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఏదైనా వ్యాపారం పెట్టాలన్న ఉద్దేశంతో వచ్చామని, అన్నీ పరిశీలించిన తర్వాత వ్యాపారాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆఫీస్‌తోపాటు తాము వుండడానికి అద్దెకు భారీ భవనం కావాలని అడిగారు. స్థానిక నేతల సహకారంతో వెదురువాడలో ఆధునిక వసతులు వన్న ఒక ప్రైవేటు గెస్ట్‌హౌస్‌ని అద్దెకు తీసుకున్నారు. తరువాత తాము ప్రారంభించబోయే కర్మాగారంలో పనిచేయడానికి ఉద్యోగులు వస్తున్నారని, వారు వుండడానికి అపార్ట్‌మెంట్ కావాలని చెప్పడంతో అచ్యుతాపురం-పూడిమడక రహదారిలో కుమారపురం వద్ద ఒక అపార్టుమెంట్‌ను చూపించారు. దీనిని కూడా అద్దెకు తీసుకున్నారు. అచ్యుతాపురంలో మరి కొంత మంది నాయకులు, ఇతరులతో పరిచయాలు పెంచుకొని ఒకరికి తెలియకుండా మరొకరి సహకారంతో భోగాపురంలో పవన్ అపార్టుమెంట్, ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే మార్గంలో ఐదంతస్థుల ఉషోదయ అవెన్యూ, జంగులూరు జంక్షన్ వద్ద సిరిపురం లేఅవుట్‌లో భువనేశ్వరి అపార్ట్‌మెంట్‌లో ఏడు ఫ్లాట్లు అద్దెకు తీసుకున్నారు. వీటిల్లో కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసి సైబర్ మోసాలకు దిగారు.

అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో రామన్నపాలెం వద్ద ఎస్‌టీబీఎల్ లేఅవుట్ సమీపంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నివాసం ఉంది. దీనికి సుమారు అర కిలోమీటరు దూరంలో ఉషోదయ అవెన్యూను సైబర్ నేరగాళ్లు అద్దెకు తీసుకున్నారు. దీని సెల్లార్‌ను పూర్తిగా మూసేశారు. ఎమ్మెల్యే ఇంటికి ఎవరు వెళ్లాలన్నా ఈ అవెన్యూ ముందు నుంచే వెళ్లాలి. సుమారు ఏడాది నుంచి ఇక్కడ సైబర్ మోసాలు జరుగుతున్నప్పటికీ ఎవరూ గుర్తించకపోవటం విశేషం.

పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలు కొనుగోలు

సైబర్ నేరగాళ్లు అచ్యుతాపురంలోని ఆటోమొబైల్ షోరూమ్‌లో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసినట్టు తెలిసింది. అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో గల ఒక ద్విచక్రవాహన షోరూంలో ఒకేసారి 15 వాహనాలు కొనుగోలు చేశారని సమాచారం. ఇదే రోడ్డులో పాతవాహనాల విక్రయ కేంద్రం లో కూడా పది ద్విచక్రవాహనాలు కొనుగోలు చేశారని చెబుతున్నారు. వాహనాలు కొనుగోలు చేసే సమయంలో ఒక ఆర్మీ అధికారితోపాటు కొంతమంది స్థానికులు ష్యూరిటీలు ఇచ్చారని తెలిసింది.

రైలు ఎక్కుతూ జారిపడి మహిళ మృతి

... 5వ పేజీ తరువాయి

ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య శ్వేత (33), పిల్లలు రిత్విక్, చేతన్‌లతో కలిసి గండి మైసమ్మ ప్రాంతంలో నివాసం వుంటున్నాడు. స్కూళ్లకు వేసవి సెలవులు కావడంతో ఆదివారం దొండపూడి రావాలనుకున్నారు. పిల్లలిద్దరినీ తీసుకుని శ్వేత ఆదివారం ఉదయం లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ వీరు స్టేషన్‌కు వెళ్లేసరికి రైలు బయలుదేరుతున్నది. దీంతో హడావిడిగా జనరల్ బోగీ ఎక్కేశారు. సుమారు గంట తరువాత రైలు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుని ఆగింది. దీంతో శ్వేత, ఇద్దరు పిల్లలతో సాధారణ బోగీ నుంచి దిగి రిజర్వేషన్ చేయించుకున్న బోగీ దగ్గరలోకి చేరుకుంది. అయితే రైలు కదలడంతో.. పిల్లలను బోగీలోకి ఎక్కించి, తాను కూడా ఎక్కబోయింది. ఈ క్రమంలో పట్టుతప్పి బోగీకి, ప్లాట్ ఫారానికి మధ్యలో ఇరుక్కుపోయి కిందకు జారిపోయింది. తీవ్రంగా గాయడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయం దొండపూడిలోని కుటుంబ సభ్యులకు తెలియడంతో వెంకటేశ్ తండ్రి అప్పారావు, తల్లి మునలమ్మ కుప్పకూలిపోయారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి బంధువులు ఇక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

పట్టాలు ఇస్తామన్నారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు!

ఏళ్ల తరబడి 35 కుటుంబాల ఎదురుచూపు

- కలగా మిగిలిన ఆర్అండ్బీ నిర్వాసితుల పట్టాల పంపిణీ
- అధికారులు స్పందించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరిక



రహదారి విస్తరణలో భాగంగా సగం కూల్చిన ఇళ్లు

పరవాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : 'ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు... పట్టించుకోవడం మానేశారు..' అంటూ పలువురు నిర్వాసితులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రహదారి విస్తరణ కోసం ఇళ్లు కోల్పోయినప్పటికీ తమను ఆదుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. పరవాడ- అనకపల్లి ఆర్అండ్బీ రహదారి విస్తరణ కోసం 2004 సంవత్సరంలో రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లను తొలగించారు. ఇళ్లు కోల్పోయిన, సగం సగం కూల్చిన ఇళ్ల వారికి వేరే చోట ఇంటి స్థలాలు ఇస్తామని అప్పట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రహదారికి ఇరువైపులా నివాసాలు ఉంటున్న వారంతా విస్తరణ పనులకు అంగీకరించారు. నెల రోజుల్లోనే రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయి. కానీ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు మాత్రం నేటికీ అందలేదు. కొంతకాలం పాటు చాలా మంది సగం సగం కూల్చిన ఇళ్లల్లోనే నివాసం ఉండేవారు. ఈ క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో నీరంతా ఇళ్లలోకి చొచ్చుకొని రావడంతో ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. దీంతో చాలా మంది వేరొక చోట ఇళ్లు కట్టుకొని నివాసం ఉండగా, కొంతమంది అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు.

రహదారి విస్తరణ పుణ్యమాని 35 కుటుంబాలవారు రోడ్డున పడ్డారు. ఇదిగో ఇస్తాం... అదిగో ఇస్తాం.. అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఏళ్ల తరబడి చెబుతూనే ఉన్నారు తప్ప కార్యరూపం దాల్చడం లేదని వారంతా వాపోతున్నారు. పట్టాల పంపిణీ ప్రక్రియ కలగానే మిగిలిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పడుతున్న బాధలను అర్థం చేసుకుని ఇళ్ల పట్టాలు తొందరగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.



'ద్వారబంధాల చంద్రయ్యనాయుడు' నాటికలో సన్నివేశం

ముగిసిన నాటిక పోటీలు

కశింకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): గవరపేట వీధిలో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాటికలు ఎంతగానో ఆకట్టుకోవడంతో పాటు ఆహుతులను ఆలోచింపజేశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో రెండు నాటికలు ప్రదర్శించారు. కృష్ణా ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ వారు 'ద్వారబంధాల చంద్రయ్యనాయుడు' నాటిక, జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ విశాఖపట్నం వారు 'అనగనగా ఒక రాజు' నాటికను ప్రదర్శించారు. ముందుగా ఈ కార్యక్రమంలో బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొని జ్యోతిప్రజ్వలనతో సాంఘిక నాటికలను ప్రారంభించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి

- మాస్టర్ ట్రైనర్లు బాధ్యత కీలకం: కలెక్టర్ విజయకృష్ణన్



యోగాసనాలు వేస్తున్న మాస్టర్ ట్రైనీలు

అనకాపల్లి టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న యోగా మాస్టర్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా శిక్షణ తీసుకున్నాక మండలాలల్లో 50 మందికి శిక్షణ అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌లో నమోదు కావాలని, ప్రజలు పెద్ద ఎత్తున యాప్‌లో రిజిస్ట్రేషను చేసుకొని ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసేలా అవగాహన, ప్రచారం కల్పించాలని సూచించారు. అలాగే యోగాతో ఆరోగ్యం వస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారిణి కె.మనోరమ, జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ కె.లావణ్య, యోగా సంస్థల అభ్యాసకులు పాల్గొన్నారు.

దుర్గమాంబకు వెండి ఆభరణాల బహూకరణ



అమ్మవారి ఆభరణాలను ఊరేగిస్తున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

లంకెలపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబకు స్థానిక దాత చిట్టిబోయిన అప్పారావు, పైడమ్మ దంపతులు ఆరు కేజీల వెండితో కిరీటం, ముక్కు పుడక, చెవి దిద్దులు, ముక్కునత్త తయారు చేయించి ఆదివారం బహూకరించారు. తొలుత వెండి ఆభరణాలను గ్రామంలో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, కొలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ చేతుల మీదగా అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సుందరపు అప్పారావు, కర్రి అప్పారావు, మంత్రి గిరి ప్రసాద్, కోటేశ్వరరావు, సన్యాసిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



పెద్దబజారు వద్ద ర్యాలీ చేస్తున్న కూటమి నాయకులు, మాజీ సైనికులు

కశింకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారతదేశ సైనికులకు సంఘీభావం తెలుపుతూ కశింకోటలో ఆదివారం ఉత్సాహంగా తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ నాయకులు సిదిరెడ్డి శ్రీను, ప్రగడ నాగేశ్వరరావు, మాజీ సైనికుడు గొంతిన రమణ తదితరులు పాల్గొని మాట్లాడారు. భారతదేశం సైనికులు పాకిస్తాన్‌ను అతి కొద్ది సమయంలోనే మట్టిపెట్టి ఘన విజయం సాధించడాన్ని ప్రపంచ దేశాలు ప్రత్యక్షంగా చూశాయన్నారు. ఈ ఆపరేషన్‌లో ఘన విజయం సాధించేందుకు ప్రాణాలు తెగించి యుద్ధంలో పాల్గొన్న సైనికులకు సంఘీభావం తెలిపారు. యుద్ధంగా ప్రాణ త్యాగం చేసిన వారికి ఇదే ఘన నివాళి అని పేర్కొన్నారు. ముందుగా పెద్దబజారు జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి

- అనకాపల్లి ఎక్సైజ్ డీఎస్పీ ఆనంద్



విద్యార్థులకు నీతి కథల సారాంశాన్ని వివరిస్తున్న డీఎస్పీ ఆనంద్

కశింకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన దేశభక్తి కలిగి ఉండాలని అనకాపల్లి ఎక్సైజ్ డీఎస్పీ ఎ.ఆనంద్ సూచించారు. తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా దృష్టి సారించాలన్నారు. అనంతరం నీతి కథల పుస్తకాలను విద్యార్థులతో చదివించి, వాటి సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కొణతాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయం ఆవరణలో క్యూలైన్‌లో ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన నూకాంబిక అమ్మవారి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. అమ్మవారి జాతర ముగిసి నాలుగు వారాలైనప్పటికీ సాధారణ రోజులతో పాటు ఆదివారం కూడా ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలిరావడం కనిపించింది. క్యూలైన్లు భక్తులతో రద్దీగా మారాయి. ఆలయానికి వచ్చే భక్తులకు అధికారులు చల్లటి తాగునీటిని సరఫరా చేశారు. కుటుంబాల సమేతంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు తయారుచేసి, అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే మార్గాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ మాజీ ఛైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు తగిన చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పట్టణ సీఐ టీవీ.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు చేపట్టారు.

'దేవదాయ భూములు 33 ఏళ్ల లీజు సరికాదు'

కొత్తూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): దేవదాయ భూములను 33 ఏళ్ల వరకు లీజుకు ఇవ్వడం సరికాదని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీడీ.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకసారి భూమి బయటకు వెళ్తే అక్రమాలు జరిగాక తిరిగి దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవడం వీలు పడడంలేదన్నారు. కోర్టులు, సాంకేతిక సమస్యలు, జాప్యాలను అధిగమించలేని స్థితి నెలకొందన్నారు. ఇప్పటికే లీజుదారుల ఆక్రమణల నుంచి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి దేవదాయ శాఖ ఎన్నో న్యాయ పోరాటాలు చేస్తున్నదని గుర్తు చేశారు. ధర్మాచార్యులు, ధార్మిక సంస్థలతో చర్చించి తీర్మానం చేసిన తరువాత జీవో అమలు చేయాలని ఆయన కోరారు.

'వైసీపీ బలోపేతానికి కమిటీలు'

సబ్బవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి నుంచి వైసీపీ బలోపేతానికి కమిటీలను ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసి, అధిష్ఠానానికి నివేదిక పంపుతామన్నారు. అంకితభావంతో పనిచేసేవారిని గుర్తించి పదవులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గండి రవికుమార్, కర్రి బాబు, బోకం రామునాయుడు, పాలిశెట్టి సురేశ్‌రాజ్, మోపాడ అప్పారావు, కొటాన రాము, వడ్డాది అప్పలాజు, యడ్ల నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

సబ్బవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): దేవీపురంలో వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి శంకరరావు విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు చందస్సు, గణితం, సంస్కృత భాష, వేద మంత్రాలను బోధించినట్టు చెప్పారు. కందర్ప రమా, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత, జ్ఞాన గ్రంథాలపై ప్రచారం

కొత్తూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని సుందరయ్యపేట, అచ్చెయ్యపేట గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ సభ్యులు భగవద్గీత, జ్ఞాన గ్రంథాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం గురించి వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా వ్యర్థ జలాల పైపులైన్‌కు లీక్

- బహిరంగ ప్రదేశాల్లోకి పారిన పైనం
- రాంకీ తీరుపై ప్రజల మండిపాటు



బహిరంగ ప్రదేశంలో పారుతున్న ఫార్మా వ్యర్థ జలాలు

పరవాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): ఫార్మా పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను రాంకీకి చెందిన సీఈటీపీ (కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)కు తరలించే పైపులైన్‌కు స్థానిక అరబిందో ఫార్మా పరిశ్రమ సమీపంలో ఆదివారం మ్యాన్‌హోల్ వద్ద లీకేజీ ఏర్పడింది. దీని కారణంగా ఫార్మా వ్యర్థ జలాలు బయటకు వెదజల్లడంతో పాటు సమీప ప్రాంతంలోని బహిరంగ ప్రదేశం, కాలువలోకి పారింది. భరించలేని దుర్వాసన రావడంతో కార్మికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు హాని కలిగించే ఈ వ్యర్థ జలాలు పైపులైన్ మ్యాన్‌హోల్ ద్వారా బయటకు రావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ నిర్వహణ చేపడుతున్న రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు.

గత ఆదివారం ఫార్మా వ్యర్థ జలాలను నేరుగా బయటకు విడిచి పెట్టడంతో, అవి స్థానిక మల్లోడిగెడ్డలోకి కలిసిన సంగతి తెలిసిందే. ఇంతలోనే మరలా ఫార్మా వ్యర్థాలు బహిరంగ ప్రదేశంలోకి పారడంతో రాంకీ తీరు పట్ల పరవాడ, తానాం ప్రజలు మండిపడుతున్నారు. పైపులైన్ నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రహదారుల్లో అనధికార పార్కింగ్

- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు.. ప్రజల అగచాట్లు



సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే మార్గంలో నిలుపుదల చేసిన వాహనాలు

పరవాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రధాన మార్గాల్లో అనధికార పార్కింగ్‌లతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రధానంగా పరవాడ మండల పరిషత్ కూడలి, సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారితో పాటు స్థానిక ఇండస్ట్రియల్ పార్కులోని బీకేసీ స్టీల్ పరిశ్రమకు వెళ్లే రహదారిలోనూ వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తూ రాకపోకలకు



బీకేసీ స్టీల్ పరిశ్రమకు ఎదురుగా రహదారిపై నిలుపుదల చేసిన వాహనాలు

ఇబ్బందులు కల్పిస్తున్నారు. ఆయా మార్గాల్లో నిత్యం అచ్యుతాపురం సెజ్, ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, లంకెలపాలెం వెళ్లే భారీ, తదితర వాహనాలతో పాటు కార్మికులు, ఉద్యోగులతో రద్దీగా ఉంటుంది. అలాంటి ఈ మార్గాల్లో భారీ వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా ఎప్పటికప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు, వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ చేయకుండా రవాణా, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కలపాకలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



వినియోగంలో లేని ఆర్వో ప్లాంట్

పరవాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలపాక గ్రామంలో ఆర్వో ప్లాంట్ మూలకు చేరింది. గ్రామస్తులకు శుద్ధి చేసిన నీటిని అందించాలనే లక్ష్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12 లక్షలతో దీన్ని నిర్మించారు. గ్రామంలో సుమారు 1500 మంది ఈ ప్లాంట్‌ను వినియోగించుకునేవారు. పంచాయతీ అధికారులకు దీని నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కొన్నేళ్ల పాటు బాగా పనిచేసింది. 20 లీటర్ల క్యాన్ రూ.5కే విక్రయించేవారు. కొన్నేళ్లుగా మరమ్మతులకు గురై మూలకు చేరినా ఎవరూ పట్టించుకోలేదు. తాగునీటికి సమీప గ్రామాలకు వెళ్లాల్సి వస్తున్నదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ వాహన చోదకుడు

లంకెలపాలెం, మే 25 (ఆంధ్రజోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారి లంకెలపాలెం కూడలికి సమీపంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం ప్రాంతానికి చెందిన జె.అప్పన్న గాజువాక నుంచి ద్విచక్ర వాహనంపై, వస్తుండగా మంత్రిపాలెం గ్రామానికి చెందిన అచ్చెన్న రాంగ్ రూట్‌లో మరో వాహనంపై ఎదురుగా వెళ్లి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ రహదారిపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు చికిత్స నిమిత్తం ఆటోలో గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ ఫలితాల్లో డీవీఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



జె.కార్తీక్



వెంకటలక్ష్మి ప్రసన్న

అనకాపల్లి టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ చివరి సంవత్సరం ఫలితాల్లో దాడి వీరునాయుడు కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బి.కాం కంప్యూటర్ విభాగంలో జె.కార్తీక్, ఆర్.వెంకటలక్ష్మీప్రసన్న అత్యధిక గ్రేడ్ పాయింట్లు 9.00 సాధించి యూనివర్సిటీ స్థాయిలో ద్వితీయ స్థానం పొందారని ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు యు.నాగేశ్వరరావు, ఎస్ఎస్ జమీర్ అభినందించారు.